ప్రజాశక్తి
శుక్రవారం 26 డిసెంబరు, 2025



నేడు రథసప్తమిపై ప్రజాభిప్రాయ సేకరణ రద్దు



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

అరసవల్లి ఆలయంలో నిర్వహించే రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై సూచనలు, సలహాల స్వీకరణపై ఈనెల 26వ తేదీన జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 25న రథసప్తమి పండగను రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిర్వహించేందుకు సలహాలు, సూచనలు తీసుకునేందుకు నిర్వహించాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని తెలిపారు.

ఈ పండగకీ ఇంతే...

రేషన్ సరుకుల్లో బియ్యం తప్ప ఇంకేం ఇవ్వడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌లో అన్ని సరుకులూ ఇస్తాం. క్రిస్మస్, సంక్రాంతి కానుకలు ఇస్తాం. ఇవీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ప్రజలకు చెప్పిన మాటలు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు పండగ సీజన్‌లు వచ్చినా హామీ మాత్రం అమలు కాలేదు. సంక్రాంతి, క్రిస్మస్ కానుకలు పక్కన పెడితే కనీసం పండగ నెలలో కందిపప్పుకూ దిక్కు లేని పరిస్థితి నెలకొంది. ఎప్పటి మాదిరిగానే బియ్యం, పంచదార మాత్రమే అందించడానికి సిద్ధమవుతోంది. జనవరి నెల రేషన్‌లో గోధుమపిండి ఇవ్వాలని నిర్ణయించినా, దాన్ని కేవలం జిల్లా కేంద్రంలోని లబ్ధిదారులకు మాత్రమే పరిమితం చేసింది.



- **సంక్రాంతి కానుక ఊరింపే**
- **కనీసం కందిపప్పు కూడా పంపిణీ చేయని ప్రభుత్వం**
- **జిల్లా కేంద్రంలోనే గోధుమపిండి పంపిణీ**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 1603 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,68,322 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 19,83,274 మంది లబ్ధిదారులు సభ్యులుగా ఉన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా జనవరి నెల రేషన్‌లో బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, పంచదార తదితర సరుకులు పంపిణీ చేస్తారని అంతా భావించారు. వీటితో పాటు సంక్రాంతి కానుక రూపంలో ఇతర వస్తువులనూ అందిస్తుందని అంతా ఆశించారు. జనవరి నెల రేషన్‌లో బియ్యం, పంచదార మినహా ఇతర సరుకులేమీ ఇవ్వడం లేదు. ఒక్క గోధుమ పిండిని మాత్రమే అందించాలని నిర్ణయించింది. అదీ శ్రీకాకుళం నగర పరిధిలోని లబ్ధిదారులకు ఇవ్వనుంది. గత నెల మాదిరిగానే బియ్యం బదులుగా కేజీ నుంచి మూడు కేజీల వరకు రాగులు ఇవ్వాలని నిర్ణయించింది.

జిల్లాకు 200 టన్నుల గోధుమపిండి

జనవరి రేషన్‌లో రాయితీపై గోధుమపిండి అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో పలురకాల బ్రాండ్‌ను బట్టి కేజీ రూ.40 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు. రేషన్ దుకాణాల ద్వారా కేజీ గోధుమపిండిని రూ.20కు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన గోధుమలను రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ మర ఆడించి ప్యాకెట్ల రూపంలో అందించనుంది. ఇందుకోసం జిల్లాకు 200 మెట్రిక్ టన్నుల గోధుమపిండి ప్యాకెట్లను ప్రభుత్వం జిల్లాకు పంపనుంది.

11 నెలలుగా ఆగిన కందిపప్పు పంపిణీ

రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డిసెంబరులో 50 శాతం కుటుంబాలకు, జనవరిలో కార్డుదారులందరికీ పంపిణీ చేశారు. తర్వాత అక్కడ నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వడమే మానేశారు. రేషన్‌లో కందిపప్పు కోసం 11 నెలలుగా లబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు.

అధిక ధరకు కందిపప్పు కొనుగోలు

ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ఆరు నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోవడంతో కార్డుదారులు బయట మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్‌లో కేజీ కందిపప్పు రూ.130 నుంచి రూ.150 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67కే కందిపప్పు అందించేది. ఇది కార్డుదారులకు అధిక ధర నుంచి ఉపశమనం కలిగించేది. ప్రభుత్వం కందిపప్పు సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులకు నిరాశే మిగిలింది.

11న ఎపి ఎన్‌జిఒ జిల్లా కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యవర్గానికి సంబంధించి జనవరి నెల 11న ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని తాలుకాల ఎన్నికలూ పూర్తయ్యాయని తెలిపారు. నేపథ్యంలో జిల్లా కార్యవర్గానికి సంబంధించి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ నెల 30న నామినేషన్ల స్వీకరణ, 31న నామినేషన్ల విత్ డ్రా, జనవరి 11న ఎన్నిక ఉంటుందన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఆర్.రవిశంకర్ (జిల్లా కార్యదర్శి, విశాఖపట్నం), సహాయ ఎన్నికల అధికారిగా వై.ఎన్.ప్రసాద్ (జాయింట్ సెక్రటరీ, విశాఖపట్నం) వ్యవహరించనున్నారని అన్నారు. అలానే జిల్లా కార్యవర్గంలో నలుగురు ఇసిలు, పట్టణ కార్యవర్గంలో 13 మంది ఇసిల నియామకం పూర్తవుతుందన్నారు. అధ్యక్ష, ఒక సహాధ్యక్ష, ఆరుగురు ఉపాధ్యక్షులు, కార్యదర్శి, కార్యనిర్వాహక కార్యదర్శి, ఆరుగురు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారికి ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం 17 మందితో కూడిన కొత్త కార్యవర్గంతో పనిచేయనుందన్నారు. కొత్త ఏర్పాటు కానున్న జిల్లా కార్యవర్గంలో ఆరుగు ఉపాధ్యక్షుల్లో మహిళకు, ఆరుగురు సంయుక్త కార్యదర్శుల్లో మహిళకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు 'మీ చేతికి.. మీ భూమి' కార్యక్రమం

22-ఎ భూములపై ప్రత్యేక డ్రైవ్



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

'మీ చేతికి.. మీ భూమి 22ఎ భూస్వేచ్ఛ' పేరుతో ఈనెల 26న నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నిషేధిత భూముల విషయమై ఎవరైనా విజ్ఞాపనలు చేసుకోవచ్చని, సంబంధిత అర్జీలను రెవెన్యూ అధికారులు పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఇప్పటికే 22-ఎ జాబితాలో నిషేధిత భూముల విషయమై కేబినెట్‌లో చర్చించినట్లు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం భూముల రీ సర్వే పేరిట రికార్డులన్నింటినీ అస్తవ్యస్తం చేసిందన్నారు. వాటిని గాడిలో పెట్టేందుకు, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు, రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అర్హత ఉండి, గత పాలకుల తప్పిదం కారణంగా 22-ఎ జాబితాలోకి చేరిన భూముల విషయమై తమ దృష్టికి తీసుకొస్తే, సంబంధిత చర్యలను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం దక్కేలా చేస్తామన్నారు. 22-ఎ, 22-1 ఎ, 22-1 బి, 22-1 సి, 22-1 డి జాబితాలో గత పాలకుల తప్పిదం కారణంగా ఎవరైనా చేరిపోయి ఉంటే, రెవెన్యూ అధికారులు నిర్వహించే భూ స్వేచ్ఛ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా మూడు రెవెన్యూ డివిజన్లకు చెందిన ఆర్‌డిఒలు, అన్ని స్థాయిల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు హాజరవుతారని తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇప్పటికే వీరికి మార్గనిర్దేశం చేశారని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

'నవతి' డిపాజిట్ పథకం ప్రారంభం

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ (డిసిసిబి) స్థాపించి 90వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన నవతి ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని నిమ్మాడలో గల క్యాంపు కార్యాలయంలో ఈ పథకాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. 900 రోజుల కాలపరిమితితో అమలు చేయనున్న ఈ పథకంలో సీనియర్ సిటిజన్లకు 9 శాతం, ఇతరులకు 8.5 శాతం వడ్డీ చెల్లించనున్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డిసిసిబి 89 ఏళ్లుగా ఖాతాదారులకు విశ్వసనీయ సేవలు అందించడం అభినందనీయమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆ లక్ష్య సాధనలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని సూచించారు. 89 ఏళ్లుగా సుదీర్ఘ సేవల అనుభవంతో డిసిసిబి ఖాతాదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, నవతి ప్రత్యేక డిపాజిట్ పథకం ద్వారా ప్రజలకు అధిక వడ్డీ రేటుతో మేలు చేస్తోందని చెప్పారు. సీనియర్ సిటిజన్లకు 9 శాతం వడ్డీ అందించడం అభినందనీయమైన విషయమన్నారు. రైతులు, ప్రజలు, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాంకింగ్ సేవలు మరింత పారదర్శకంగా, వేగవంతమయ్యేలా ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తోందన్నారు. రైతులకు రుణాల మంజూరులో ఎలాంటి ఆలస్యం లేకుండా బ్యాంకులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ ఎస్.సూర్యనారాయణ, డిసిసిబి సిఇఒ సత్యనారాయణ, వరప్రసాద్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కవిటి : విప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరమణ

టిడిపి నాయకులకు సముచిత స్థానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రానికి చెందిన అనుపాన రాజశేఖర్‌రెడ్డిని జిల్లా పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఇటీవల నియమించారు. ఈ నియామకం స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు చొరవతో జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాజశేఖర్‌రెడ్డి గతంలో టిడిపి మండల అధ్యక్షులుగా, పాతపట్నం మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించారు. టిడిపి బలోపేతానికి ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు నాయకులు తెలిపారు. అలాగే పెద్దలక్ష్మీపురానికి చెందిన మాజీ సర్పంచ్ బూర్ల లలిత కుమారిని స్పోకెన్ పర్సన్‌గా నియమించారు.

నందిగాం : మండలంలో శివరాంపురం సర్పంచ్ జానకి రాముకు టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ కార్యనిర్వహణ కార్యదర్శిగా నియమించారు. దీంతో పంచాయతీ ప్రజలు హర్షాతి రేఖలు వ్యక్తం చేశారు.

కవిటి: టిడిపి సీనియర్ నాయకుడు, ఇచ్ఛాపురం ఎఎంసి మాజీ వైస్ చైర్మన్ సీపాన వెంకటరమణకు సముచిత స్థానం లభించిందని పలువురు టిడిపి నేతలు అభిప్రాయపడ్డారు. టిడిపి పార్లమెంటరీ కమిటీ జిల్లా ఉపాధ్యక్షునిగా వెంకటరమణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. బరువైన బాధ్యతలు తనకు అప్పగించినందుకు అశోక్‌కు కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో పుల్లట రాజేష్, కడియాల వెంకటరావు, పిరియా రాజేష్ పాల్గొన్నారు.

సోంపేట : టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా సోంపేటకు చెందిన మడ్డు రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి నియామక పత్రాలు వచ్చాయి. పార్టీ తనపై ఉంచిన బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని అన్నారు. ఇందుకు సహకరించిన పార్టీ నాయకులు, పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రవికుమార్‌కు బాధ్యతలు అప్పగించిన సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తమ అభినందనలు తెలియజేశారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - అరసవల్లి

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను గురువారం సందడిగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని సహాయ మాత (ఆర్‌సిఎం) చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్ చర్చితో పాటు జిల్లావ్యాప్తంగా పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని సెయింట్ లూథరన్ చర్చిలో ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేటలోని చర్చిలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పొందూరులోని సిఎంసి చర్చిలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని కేకు కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు క్రీస్తు సందేశం చదివి వినిపించారు. సెయింట్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో 20 సెంట్ల స్థలం క్రైస్తవ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించామన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికీ తనవంతు కృషి చేస్తానన్నారు. త్వరలోనే ప్రహరీ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. సెయింట్ లూథరన్ చర్చుకు వెళ్లే మార్గంలో రోడ్డు లేకపోవడంతో కమిటీ సభ్యుల విజ్ఞాపన మేరకు సిసి రహదారిని నిర్మిస్తామన్నారు. బరియల్ గ్రౌండ్‌కు కాంపౌండ్ వాల్ నిర్మిస్తామని, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో సోలార్ దీపాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. సెయింట్ లూథరన్ చర్చి పాస్టర్ టి.కిరణ్, కోశాధికారి హెన్రీ, జ్యోతి ఫ్రెడరిక్, ఇతర కమిటీ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

పలు గంజాయి కేసుల్లో
నిందితునిపై పిట్ ఎన్‌డిపిఎస్ చట్టం

చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం

చట్టాన్ని తరుచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ విజయనగరం జిల్లాలో గంజాయి రవాణాలో 'కింగ్‌పిన్'గా వ్యవహరిస్తూ నిందితుడిగా పఠాన్ బాషా అలీ (31) పై అత్యంత కఠినమైన 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని ప్రయోగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం కొత్తవీధికి చెందిన ప్రస్తుతం విజయనగరం పట్టణంలోని పూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా గురువారం అతడిని నిర్బంధించి, విశాఖపట్నం కేంద్ర కారాగానికి తరలించామని తెలిపారు. పఠాన్ బాషా అలీ చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ వ్యవస్థీకత నేరగాడిగా మారాడని పోలీసులు గుర్తించారు. గత నాలుగేళ్లలో విజయనగరం జిల్లా గంట్యాడ పోలీసు స్టేషనులో (1596.36 కిలోల) 1 గంజాయి కేసు, విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో (13.10 కిలోల) 2 గంజాయి కేసులు, బాపట్ల జిల్లా నిజాంపట్నం పోలీసు స్టేషనులో (1.5 కిలోల) 1 గంజాయి కేసులో (మొత్తం 4కేసులు) నిందితుడిగా అరెస్టు అయ్యాడని తెలిపారు. పఠాన్‌బాషా అలీ ప్రవర్తన సమాజానికి హానికరంగా మారుతున్న కారణంగా నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పఠాన్ బాషా అలీపై 'పిట్ ఎన్‌డిపిఎస్' చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వచ్చాయన్నారు. నిందితుడు పఠాన్ బాషా అలీపై ఇప్పటికే విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో సస్పెక్ట్ షీటు ఉందని ఎస్‌పి తెలిపారు. శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కలిగించినా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, సమాజానికి ప్రమాదకరంగా మారితే ఉపేక్షించేది లేదన్నారు.

చలో లోక్ భవన్ విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిసెంబర్ 27న చలో లోక్ భవన్ కార్యక్ర మం విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం ప్రకటనలో పిలుపు నిచ్చారు. 27న చలో లోక్ భవన్ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, దళితులు, గిరిజనులు ఇతర పేదలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే ఈనెల 26న ప్రభుత్వ నిర్వహించనున్న గ్రామసభల్లో నిరసన తెలియజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇబిజిఆర్‌ఎఎంజి పేరుతో తెచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేయాలన్నారు. కొత్త పథకంలో కేంద్రం ఆర్థిక భారాన్ని తగ్గించుకుని, రాష్ట్రాలపై మోపిందన్నారు. రాష్ట్రాలకు మాత్రం 90 శాతం నిధులిస్తూ మరికొన్ని రాష్ట్రాలకు 60 శాతం నిధులు కేటాయిస్తూ వివక్ష చూపు తుందన్నారు. రాష్ట్రాలపై ఆర్థికభారం పడుతున్నా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మిన్నకుండడం తగదన్నారు. 100 రోజుల పనిదినాలని 125 రోజులకు పెంచామనడం ప్రజలను మభ్యపెట్టడమేనని తెలిపారు. ఈనెల 26న నిర్వహించే గ్రామ సభల్లో ఈ పథకానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలని రైతులు, వ్యవసాయ కార్మికులకు ఆయన పిలుపునిచ్చారు.



30న జాబ్‌మేళా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 30వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో టెక్ మహీంద్రా, మిరాకిల్ సాఫ్ట్‌వేర్, టెక్నో ఫజల్ ప్రైవేటు లిమిటెడ్, ఇన్‌స్ట్రక్టో ఎడోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, నష్ ఇండస్ట్రీ (ఎలక్ట్రికల్ వెహికల్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ) డాక్టర్ రెడ్డీస్, హెట్రో, టాటా ఎలక్ట్రానిక్స్, యొకొమా టైర్స్‌తో పాటు సుమారు 14 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 400 పైబడి ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమో, బిటెక్, డిగ్రీ, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎన్నాటికల్ కెమిస్ట్రీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువత అర్హులని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి శ్రీకాకుళం, విశాఖపట్నం, శ్రీసిటీ నెల్లూరు, హైదరాబాద్, బెంగుళూరులో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో 30న ఉదయం తొమ్మిది గంటలకు జాబ్‌మేళా ప్రాంగణానికి రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95509 67353, 83176 52552 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉల్లంఘనకు తప్పదు భారీ మూల్యం

- **వాహనంపై ఐదు చలానాలు ఉంటే లైసెన్స్ రద్దు**
- **కఠినతరం కానున్న నిబంధనలు**



ప్రజాశక్తి - బూర్జ

నిబంధనల విషయంలో వాహన చోదకులు నిర్లక్ష్యంగా ఉంటే కుదరదు. నిబంధనల ఉల్లంఘనలపై జరిమానాలకు సంబంధించి జారీ అయ్యే చలానా నిర్ణీత గడువులోగా చెల్లించుకపోయినా, వాహనంపై ఐదు, అంతకంటే ఎక్కువ జరిమానాలు ఉంటే అందుకు భారీ మూల్యం చెల్లించక తప్పదు. మోటార్ వెహికల్ (ఎపి) నిబంధనలు కఠినతరం కానున్నాయి. అందుకు కేంద్ర మోటార్ వెహికల్ రూల్ 1989 సంస్కరణకు కేంద్ర రవాణాశాఖ ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన ముసాయిదా నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ముషాయిదా నిబంధనలపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరణ అనంతరం కొత్తవి అమలయ్యే అవకాశం ఉందని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 60 వేలకు పైగా మోటార్ వాహనాలు ఉన్నాయి. రహదారి నియమాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంగాలపై ప్రతినెలా వందల సంఖ్యలో కేసులు నమోదు అవుతున్నాయి.

ఆలస్యమైతే అంతే..!

కేంద్ర రవాణాశాఖ ప్రతిపాదించిన నిబంధనల ప్రకారం జరిమానాలకు సంబంధించి 45 రోజుల్లో కట్టాలి. చెల్లింపులకు ప్రస్తుతం గడువు 90 రోజులు ఉండగా, దానిని 45 రోజులకు కుదించారు. ఆలోగా చెల్లించకపోతే ఆ వాహనాన్ని విక్రయించడం ఉండదు. లైసెన్స్‌లో చిరునామా పేరు మార్పుతో పాటు రెన్యువల్ జరగదు. వాహనాన్ని సీజ్ చేయవచ్చు.

నడిపే వారిదే బాధ్యత...

ఇప్పటివరకు వాహనంపై ఎన్ని చలానాలు ఉన్నప్పటికీ తనిఖీల సమయంలో ఒకటి రెండు చలనాలు చెల్లించి మిగిలినవి వీలైనంత త్వరగా చెల్లిస్తామని చెబితే వదిలేశారు. ఇప్పుడలా కుదరదు. కొత్త ప్రతిపాదనలో అమలుకు వచ్చిన తర్వాత అలా కుదరదు. ఒక వాహనపై జారీ అయిన చలానాలు ఐదు అంతకంటే ఎక్కువ ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు అవుతుంది. మద్యం తాగి, నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదానికి కారణమైనా లైసెన్స్ రద్దు చేస్తారు. ఆ విధంగా నిబంధనలు కొనసాగుతాయి. ఇప్పటివరకు వాహన యజమానిని బాధ్యుడిగా చేస్తుండగా, ఇకపై బండి నడిపే వ్యక్తిపైనే కేసు నమోదు చేస్తారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ట్రాఫిక్ నిబంధనలను నూతనంగా అమలు చేస్తుంది. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలి. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదు. వాహనం నడిపేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలి.

- ప్రవల్లిక, ఎస్ఐ, బూర్జ

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

పిఎసిఎస్ అధ్యక్షులు కూర్మారావు


మాట్లాడుతున్న కూర్మారావు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గిరిజన గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని, గిరిజన గ్రామాలపై ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు అన్నారు. మండలంలోని పాత్రియలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సవర గోవిందపురం కూడలి నుంచి పాత్రియ వరకు రూ.2.21 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. త్వరలో ఎమ్మెల్యే గౌతు శిరీష చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తారని అన్నారు. పాత్రియ నుంచి కొటారింగ్ తాళభద్ర వరకు మరో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో నిధులు మంజూరు అవుతుందని చెప్పారు. గిరిజన గ్రామాలకు తారు రోడ్డు నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనలో గౌతు శిరీష ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతంలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉన్నాయని, అన్ని ప్రాంతాలను కలిపి గిరిజన పంచాయతీగా ఏర్పాటు చేస్తామని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లి గిరిజన పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సవర ఉమాపతి, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఎఎంసి మాజీ డైరెక్టర్ సవర కృపావతి, నాయకులు సింహాచలం పాల్గొన్నారు.

ఆ స్థలం కష్టార్జితంతో కొనుగోలు చేశా

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి పాలకేంద్రం ఎదురుగా ఉన్న స్థలం కష్టార్జితంతో కొనుగోలు చేశాననిసినిమా నిర్మాత బలగ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఒకే అబద్ధాన్ని పదేపదే ప్రచారం చేస్తే అది నిజమని ప్రజలు నమ్మే పరిస్థితి వస్తుందన్నారు. దళిత రైతు కుటుంబంలో పుట్టిన తాను స్వశక్తితో ఎదిగానన్నారు. తన సొంత ప్రాంతం టెక్కలిలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టాలని భావించి రఘునాథపురం సర్వే నంబరు 520/3, 520/1లో రెండెకరాల జిరాయతీ భూమిని అన్ని పత్రాలు పరిశీలన చేసిన తర్వాతే ఆ స్థలాన్ని కొనుగోలు చేశానన్నారు. ఆ స్థలంలో భవనాలను నిర్మించేందుకు టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం నుంచి ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్నానని తెలిపారు. బ్యాంకు అధికారులు భవన నిర్మాణానికి రుణం కూడా మంజూరు చేశారన్నారు. ఇదిలా ఉండగా ఆ భూమిపై ఎవరో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రస్తుత టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయానికి తనను పిలిపించారన్నారు. ఆర్‌డిఒకు తాను భూమి కొనుగోలుకు సంబంధించిన డాక్యుమెంట్లు చూపించానన్నారు. అయితే తాను కొనుగోలు చేసిన భూమిని ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు ప్రభుత్వ భూమి అంటూ తరచూ ప్రకటనలు జారీ చేస్తుండటం తగదన్నారు.


శంకుస్థాపన చేస్తున్న మోహనరావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- మెళియాపుట్టి


మండలంలోని గొప్పిలిలో పలు అభివృద్ధి పనులకు పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబల వెంకటరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, మాలతి ఢిల్లీ, కోట తిరుపతిరావు, లక్ష్మీనారాయణ చౌదరిపాల్గొన్నారు. అలాగే మెళియాపుట్టి మండల కేంద్రంలో మెట్ల నిర్మాణానికి మండల టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ బసవ భాస్కరరావురెడ్డి శంకుస్థాపన చేశారు.


కళా వెంకటరావును పరామర్శిస్తున్న నాయకులు

మాజీ మంత్రి కళాకు పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

మాజీమంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును మండలానికి చెందిన పలువురు నాయకులు గురువారం రాజాంలోని కళాను పరామర్శించారు. ఇటీవల కళా వెంకటరావుకు నేత్ర శస్త్రచికిత్స జరగడంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండడంతో వీరు కలిశారు. కళాను కలిసిన వారిలో మాజీ జెడ్‌పిటిసి పిన్నింటి మధుబాబు, విజయనగరం జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వడ్డుపల్లి శ్రీనివాసరావు, యూత్ క్లబ్ అధ్యక్షుడు మేడూరి ప్రసాదరావు, గంట్యాడ అప్పలనాయుడు, టిడిపి నాయకులు ఇజ్జాడ అప్పారావు, సన్యాసినాయుడు తదితరులున్నారు.


సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

వజ్రపుకొత్తూరు: మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ ముగి జంగమయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో పలాస నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్న చౌదరి, నాయకులు ముగి జంగమయ్యను గురువారం సన్మానించారు. మత్స్యకారులు అభివృద్ధికి పాటుపడేవారికి పార్టీ గుర్తిస్తుందని అన్నారు. కంబాలరాయుడుపేట మత్స్యకార సొసైటీ అధ్యక్షులు నుంచి జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు పలువురు మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు గోవింద, పాపారావు, కంబాల దానేసు, రామకృష్ణ, వంక రామారావు, జె.జె.రావు, సురేఖ, కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంసిఎడిసి ద్వారా రుణాలు ఇవ్వాలి

నందిగాం: జిల్లాలోని గొర్రెలు, మేకలు పెంపకం దారులకు ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన సాంబమూర్తి ఒక ప్రకటనలో కోరారు. గొర్రెల మేకలు సుమారు 12 లక్షలు ఉన్నాయని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన 5, 9, 10, 16 జిఒలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో 40 వేల కుటుంబాలు గొర్రెలు, మేకల పెంపకందారుల వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారని, ఏ ప్రభుత్వం వచ్చినా గొర్రెల పెంపకందారులకు పట్టించుకోవడం లేదన్నారు. జీవక్రాంతి యూనిట్లను సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, గొర్రెల, మేకల షెడ్లు ఉచితంగా మంజూరు చేయాలని, వాక్సినేషన్లు, నత్తల నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేయాలని, ఎంసిఎడిసి రుణాలను కుటుంబానికి రూ.10 లక్షలు ఇవ్వాలని, తుమ్మ చెట్లను, చెరువు, కాలువ గట్లను మేత కొరకు కేటాయించి ఆదుకోవాలని కోరారు.

వరద కాలువలు హాంఫట్

- 'రియల్' మాఫియా గుప్పిట్లో ప్రభుత్వ భూములు
- చర్యలకు వెనుకాడుతున్న మున్సిపల్, రెవెన్యూ అధికారులు


చెరువు గర్భంలో వేస్తున్న రేకుల షెడ్

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జాకు గురవు తున్నాయి. అక్రమార్కులు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జా చేసినప్పటికీ సంబంధిత రెవెన్యూ యంత్రాంగం చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో భూబకాసురులు దందాకు పాల్పడి పబ్బం గడుపుకుంటున్నారు. సుమారు రూ.90 కోట్లు విలువ గల సూది కొండ నుంచి ఎర్ర చెరువు వరద కాలువలు, చెరువులు, డి పట్టా, అసైన్డ్ భూములు, కొండ పోరంబోకు, కొండ వాగులు, గెడ్డలు కబ్జాకు గురయ్యాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణదారులు గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు చేపట్టి కోట్లు ఆర్జిస్తూ భూదందాకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో ఐటిఐ ప్రాంతంలో 3.90 ఎకరాల డీ పట్టా, ప్రభుత్వ పోరంబోకు భూములను కబ్జా చేసి చాలావరకు భవంతులు నిర్మించారు. పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 57/1లో 1.90 ఎకరాలు భూకబ్జాదారులు కొండ వాగును ఆక్రమించి ప్లాట్లుగా చేసేశారు. ఎకరా సుమారు రూ.10 కోట్లు ధర పలుకుతుండటంతో ఓ ఇరవైమంది భూమాఫియా ముఠాగా ఏర్పడి రాజకీయ పైరవీలు చేస్తూ ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయించేందుకు సిద్ధ పడుతున్నారు. సర్వే నెంబర్లు 26, 28, 34, 35, 40, 43, 44, 46, 47లో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. సర్వే నెంబర్ 29లో ఎర్ర చెరువు కాలువను కప్పేసి దానిపై అక్రమ కట్టడాలతో నలభై అడుగుల కాలువ కుచించుకుపోయి నాలుగు అడుగుల కాలువగా మిగిలి పోయిందని, ప్రక్కనున్న జిరాయతీ స్థలాలు, రోడ్లపైకి మురుగు నీరు చేరి చెరువును తలపిస్తోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఎర్ర చెరువు కాలువపై నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తు న్నారు. కబ్జాకు గురి కాకుండా ప్రభుత్వ భూములకు రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి- లావేరు


శ్రీనివాసరావు

విజయనగరం టిడిపి జిల్లా ఉపాధ్యక్షునిగా నియమితులైన వడ్డుపల్లి శ్రీనివాసరావు టిడిపి రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు సేవచేసే అవకాశం కల్పించిన సిఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖామంత్రి లోకేష్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. వారిచ్చిన ఈ అవకాశం ద్వారా, విజయనగరం జిల్లా టిడిపి బలోపేతానికి, ప్రభుత్వ లక్ష్యాల సాధనకు నిరంతరం పార్టీ నాయకుల సహకారంతో, కార్యకర్తలందరితో కలిసి పనిచేసి, టిడిపి విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

పార్టీ విజయానికి కృషి చేస్తా

రణస్థలం: టిడిపి కమిటీలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు నియామకమయ్యారు. అందులో భాగంగా రణస్థలం మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, రణస్థలం మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావుకు విజయనగరం పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షుగా నియమించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఎనలేని సేవలను అందిస్తున్నాని, ఈపదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.


రమేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

టిడిపి జిల్లా అధ్యక్షుడిని కలిసిన నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

టిడిపి జిల్లా అధ్యక్షునిగా ఇటీవల నియమితులైన మొదలవలస రమేష్‌కుమార్‌ను ఆమదాలవలసలోని ఆయన స్వగృహంలో గురువారం పొందూరు మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిఎం చంద్రబాబు నాయుడు రమేష్‌కుమార్‌ను జిల్లా టిడిపి అధ్యక్షునిగా నియమించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈయనను కలిసిన వారిలో టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు తదితరులున్నారు.


పరామర్శిస్తున్న వెంకన్న చౌదరి

వెంకన్న చౌదరి పరామర్శ

పలాస: మండలంలోని హట్కో కాలనీకు చెందిన గార రమణమ్మ, మండలంలోని వీరరాంచంద్రపురానికి చెందిన పి.తరకేశ్వరరావు, పెద్దనారాయణపురం నిమ్మన సాయమ్మ, లొడగల కృష్ణమూర్తి, వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరికి చెందిన మామిడి అప్పారావు, బందాపు సాయమ్మలు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలాస టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి మృతుల కుటుంబాలను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను ఆయా కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్‌వడ్డి, యాదగిరి, మరడ దుర్యోధన, పైల చక్రధర్ పాల్గొన్నారు.

గోపుర నిర్మాణానికి వితరణ

కవిటి: కవిటి సముద్ర తీర మార్గానికి చేరుకునే ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయానికి యాత్రికులు ఉదారంగ సాయం అందిస్తున్నారు. అందులో భాగంగా ఆలయ గోపుర నిర్మాణానికి శ్రీవాణి గాన కళా సమితి గౌరవాధ్యక్షుడు, జల్లుపుట్టుగకు చెందిన పండి దేవేంద్రమూర్తి రూ.10 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో శ్రీవాణి గాన కళా సమితి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నెల రోజులుగా తాగునీరు వృథా

కవిటి: మండలంలోని కొజ్జిరియా పంచాయతీలోని ఆర్.అగ్రహారంలో గత నెల రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా పట్టించుకున్న నాధుడే లేడు. గ్రామంలో ఇటీవల వేసిన ఇంటింటికీ కుళాయి పనుల్లో భాగంగా గ్రామానికి చెందిన బి.మోహనరావు నివాసానికి సమీపంలో పైపుపాడై నీరు వృథా అవుతోంది. ఇటీవల గ్రామంలో కొత్తగా తాగునీటి ట్యాంకు నిర్మించి నీరు అందించాలనే లక్ష్యంతో నీరు కారుతోంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేసినా స్పందనలేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది స్పందించి తాగునీటి వృథా అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డుపై పారుతున్న నీరు

జీవనశైలి మార్పుతో అనారోగ్య సమస్యలు

ప్రజాశక్తి- పొందూరు

ప్రస్తుత సమాజంలో మారుతున్న జీవనశైలి, అలవాట్లుతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవేద పాఠశాల ఆవరణలో ప్రభావతి జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సప్పటి వసంతరావు ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతీఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్సను అందించడం ద్వారా పూర్తిగా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. చిరుద్యోగైన ట్రస్టు వ్యవస్థాపకులు వసంతరావును ఆదర్శంగా తీసుకుని స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ శిబిరంలో పలు గ్రామాలకు చెందిన 238 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. వీరిలో 22 మందిని ప్రత్యేక వైద్య పరీక్షలను నిమిత్తం జెమ్స్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ అన్నపూర్ణ, టిడిపి మండల అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్, సర్పంచ్ ఆర్.లక్ష్మి, టిడిపి పట్టణ అధ్యక్షులు అనకాపల్లి చిన్నరంగా, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, ఎంపిటిసి-4 ప్రతినిధి బాడాన శేషగిరి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్


అభినందిస్తున్న అధికారులు

కరజాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కరజాడ పాఠశాల విద్యార్థులకు 'డిజిటల్ న్యాయపాలన ద్వారా సమర్థ సత్వర పరిష్కారం' అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో చాందిని ప్రథమ స్థానం గెలుపొంది రూ.500 నగదు, అవార్డు, ప్రగడ శ్రావ్య వ్యాస రచనలో తెలుగులో ద్వితీయ స్థానం గెలుపొంది రూ.3 వేలు నగదు, అవార్డు, పల్లి పవన్‌కుమార్ ఇంగ్లీష్‌లో వ్యాసరచనలో ద్వితీయ స్థానాన్ని గెలుపొంది రూ.3 వేలు నగదు, అవార్డు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను వినియోగదారుల కమిషన్ న్యాయమూర్తి ఆర్.చిరంజీవి, డిఇఒ ఎ.రవిబాబు, పౌర సరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాశరావులు అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలంను ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, మల్లారెడ్డి పద్మనాభరావు, సిబ్బంది అభినందలు తెలిపారు.

నూతన సంఘం ఆవిర్భావం

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ల నూతన కార్యవర్గ ఎంపిక గురువారం నిర్వహించారు. సంఘ నూతన అధ్యక్షునిగా పి.మురళీకృష్ణ (సరుబుజ్జిలి), ప్రధాన కార్యదర్శిగా కె.ఉపేంద్ర (ఎల్ఎన్‌పేట), కోశాధికారిగా బి.రాంప్రసాద్ (సోంపేట), సహాయ కార్యదర్శిగా ఆర్.సంతోష్ కుమార్ (టెక్కలి), గౌరవ సలహాదారులుగా ఎస్.గౌరీశంకర్ (శ్రీకాకుళం), డిసిహెచ్ రాంబాబు (మందస), ఉపాధ్యక్షునిగా బి.శశిరేఖాదేవి (నరసన్నపేట)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మండల విద్యాశాఖ కార్యాలయంలో కీలక పాత్ర పోషిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వేతనాల పెంపు విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. డిమాండ్ల సాధనకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నామని తెలిపారు.


ఎన్నికైన నూతన సంఘ కార్యవర్గం


మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

పిఇటి భర్తను అరెస్టు చేయాలి

మెళియాపుట్టి: మండలంలోని బందపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో గిరిజన బాలికపై దొంగతనం అంట కడుతూ విచక్షణ రహితంగా దాడి చేసిన పిఇటి లావణ్య భర్త రామచంద్రరావును తక్షణమే అరెస్టు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు గణేష్, మండల కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థిపై దాడి వీడియో వైరల్ కావడంతో పాఠశాల ఎదురుగా గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రామచంద్రరావు పాఠశాలకు వెళ్లేందుకు ఎవరు అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. జువైనల్ జస్టిస్ యాక్టర్ ప్రకారంగా గిరిజన ఆశ్రమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇతరులకు ప్రవేశం లేదన్నారు. ఓ ప్రైవేటు వ్యక్తి బాలికల పాఠశాలకు ప్రవేశించి గిరిజన బాలికపై దాడి చేయడంపై రాష్ట్ర మహిళా కమిషన్, ఎస్‌టి కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిఇటి లావణ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన బాలికకు రక్షణ కల్పించాలన్నారు. రామచంద్రరావుని తక్షణమే అరెస్టు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖగేశ్వరారావు, బి.భాస్కరరావు, జి.రవి, కె.బాబూరావు, రాజేష్, రాజేష్, జన్ని చంద్రరావు, సవర ధర్మారావు, ఎస్.ప్రభాకరరావు, ఎస్.జగన్, ఎస్. ఢిల్లేశ్వరరావు, ఎస్.జగదీశ్వరరావు, జె.దాలయ్య పాల్గొన్నారు. అలాగే దాడికి పాల్పడిన రామచంద్రరావుపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదివాసీ చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు వరహాల కృష్ణారావు డిమాండ్ చేశారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


పలాస : కేక్ కట్ చేస్తున్న కూర్మారావు

ప్రజాశక్తి- అరసవల్లి

ఫెయిత్ హోమ్ చర్చిలో పాస్టర్ గంజి ఎజ్రా ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. టిడిపి నాయకులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. నగర టిడిపి అధ్యక్షులు పాండ్రంకి శంకర్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు కటారి కమల, సుభాష్ చౌదరి, సకలా బత్తుల శ్రీను, సిమ్మెంటు రమణ, దండి శ్రీను, దండి పాపారావు, పేట పద్మ, టిడిపి రాష్ట్ర డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్స్ పిఎంజె బాబు, ప్రధాన విజయరామ్, గుత్తు చిన్నారావు, సత్యసాయి మధు, లోకనాథం నాగరాజు, ఆర్ ప్రసాదరావు. వై.అబ్రహాం, మజా రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న పండగ క్రిస్టమస్ అని మాజీ తెలుగు యువత అధ్యక్షులు పంగ రమేష్ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా మండలంలోని సింగుపురంలో ఉన్న చర్చిలకు గురువారం ఎమ్మెల్యే గొండు శంకర్ తనసొంత డబ్బులతో కొనుగోలు చేసిన కేకులను అందజేశామని తెలిపారు. ప్రజలందరికీ ఎమ్మెల్యే శంకర్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొందూరు: మండల పరిధిలో పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను గురువారం క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గురువారం అర్ధరాత్రి నుంచే చర్చిలు వద్ద ప్రార్థనలతో సందడి నెలకొంది. స్థానిక సిఎంసి చర్చిలో ఎమ్మెల్యే కూన రవికుమార్, కూటమి నాయకులు పాల్గొని క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలను తెలిపారు. పాస్టర్ ప్రభుదాస్, బ్రదర్ జీవన్‌లు ప్రార్థనలు చేశారు. రాపాక కూడలిలో గల జీవంగల దేవుని సంఘంలో పాస్టర్ ఎల్.జోషఫ్ క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనలు నిర్వహించారు.

ఆమదాలవలస : పురపాలక సంఘంలోని 2వ వార్డు కృష్ణాపురం గ్రేస్ గాస్పల్ చర్చిలో క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఫాస్టర్ జి.శామ్యూల్ వరం పాల్గొని శాంతి సందేశాలను బోధించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జి.కృపావరం, బోర గోవిందరావు, బోర చిన్నమనాయుడు, డాక్టర్ పి.తాతయ్యలు, గౌరి నాయుడు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

నరసన్నపేట: పట్టణంలో నారాయణ స్కూల్ పక్కన ఉన్న చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రిస్మస్ పండగ ప్రేమ, క్షమ, త్యాగం, సేవా భావాలకు ప్రతీక అని అన్నారు. అన్ని మతాలూ సమానమే అనే భావనతో ప్రతిఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు, సంఘ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రైస్తవ సోదరులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని పాత్రియ, దానగోర, సవరగోవిందపురం, లొత్తూరు, పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాత్రియ సియోన్ గ్రేస్ చర్చిలో పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు కిస్మిస్ కేక్ కట్ చేశారు. డిప్యూటీ ఎంపిడిఒ సవర ఉమాపతి 2026 కేలండర్‌ను ఆవిష్కరించారు. గిరిజన యువతులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్, ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, ఎఎంసి మాజీ డైరెక్టర్ సవర కృపావతి, జె.రామారావు, ఎస్.చంద్రశేఖర్, ఎస్.రామారావు, ఎస్.కేశవరావు, ఎస్.కిరణ్, అసిస్టెంట్ ఫాస్టర్ ఎస్.సురేష్ పాల్గొన్నారు.


నరసన్నపేట : కొవ్వొత్తి వెలిగిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

మెళియాపుట్టి : మండలంలో పలు గిరిజన గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి దుస్తులు పంపిణీ చేశారు. అలాగే అన్నదానం చేశారు. చాపర, మెళియాపుట్టి, బందపల్లి, నేలబొంతు, పెద్దమడి, నందవ, భరణికోట, ఆంపురం, కొసమాల గ్రామాల్లోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండలంలో వివిధ చర్చల్లో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గొల్లవీధిలోని బాప్టిస్ట్ చర్చిలో చర్చ ప్రెసిడెంట్ ప్రత్తి విజయకుమార్, ఈదుపురం ఒడియా చర్చిలో పాస్టర్ బీమా, రామచంద్ర, ఆరు, హంగర్ నిరంజన, గోవిందా, పాల్ పాల్గొన్నారు. అలాగే సంతపేట, ఎస్.పేట, మండపల్లి, డొంకురులో క్రిస్టమస్ వేడుకలు నిర్వహించారు.

నందిగాం : మండలంలోని జడ్యాడ, కవిటిఅగ్రహారం, లట్టిగా, అఖిదాసుపురం, పాలవలస, కల్లాడ, నౌగాం గ్రామాల్లో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు.

కవిటి: మండలంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని చర్చిలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ సర్పంచులు ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో శివప్రసాద్ నెయ్యల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లమ్మ పంచాయతీ నేతాజీ నగర్ కాలనీలో పాస్టర్ ఎం.వి.రమణ ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు పాల్గొని క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు.


నేలబావిలో సురేష్ మృతదేహం, సురేష్ (ఫైల్)

అదృశ్యమైన వ్యక్తి బావిలో శవమై..

పొందూరు: నాలుగురోజుల క్రితం అదృశ్యమైన వ్యక్తి గురువారం పొందూరు పట్టణంలోని బండార్లమ్మ గుడి సమీపంలోని నేలబావిలో శవమై కనిపించడం కలకలం రేపింది. పోలీసుల వివరాల మేరకు మండల కేంద్రంలోని నాయుడు వీధికి చెందిన నల్లి సురేష్ (45) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈనెల 22 నుంచి సురేష్ కనిపించడం లేదని ఆయన భార్య రాజేశ్వరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి మద్యం అలవాటు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు నేలబావిలో ప్రమాదావశత్తు పడిపోయాడా, లేకుంటే ఆత్మహత్య చేసుకున్నాడా అనేది విచారణలో తెలియాల్సి ఉందని, దీనిపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసినట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ పేర్కొన్నారు.

నాగుపాము హల్‌చల్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలిలోని జిల్లా ఆస్పత్రిలో గురువారం నాగుపాము ప్రవేశించి హల్‌చల్ చేసింది. దీంతో రోగులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఉదయం విధులకు వెళ్లిన సిబ్బంది తలుపు తీయగానే నాగుపాము దర్శనం ఇచ్చింది. సిబ్బంది పామును బయటికి పంపించే ప్రయత్నం చేయగా ల్యాబ్ రూమ్‌లోకి వెళ్లి బయటకు వెళ్లిపోయింది.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టకు శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలం పంచాయతీ బండిపాలెంలో అంబేద్కర్ యూనియన్ కోరిక మేరకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గురువారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకటరమణ, అప్పలనాయుడు, గొర్లె హరి, జనార్దన్, అంబేద్కర్ యూనియన్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

సిసి రహదారి నిర్మాణం

పొందూరు: ఎవరో వస్తారు...ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ సొంత నిధులతోనే కాలనీకి అవసరమైన సిసి రహదారి, కాలువల నిర్మాణం చేపట్టి మండలంలోని కింతలి గ్రామానికి చెందిన పైడి బాబూరావు, కాలనీవాసులు ఆదర్శంగా నిలిచారు. కాలనీలో సుమారు రూ.10 లక్షలతో సిసి రహదారి, కాలువల నిర్మాణం జరిపారు. ఇందులో స్వర్గీయ పైడి బాబూరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పైడి గోవిందరావు తన తండ్రి పేరుమీద ఉన్న కాలనీకి రూ.5లక్షలు ఆర్థిక సహాయంగా అందజేశారు. దీంతో ఈ మొత్తంతో పాటు కాలనీలోని కమిటీసభ్యులు నిధులను సమీకరించుకుని ఐకమత్యంతో సిసి రహదారి, కాలువలను నిర్మించుకున్నారు. ఈ విధంగా ఆదర్శవంతంగా నిలిచిన కాలనీ వాసులకు సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతురావు, మాజీ సర్పంచ్ గణపతిరావు, గ్రామపెద్దలు అభినందనలు తెలిపారు.


సన్మానిస్తున్న వెంకన్న చౌదరి

టిడిపి నాయకులకు సన్మానం

ప్రజాశక్తి- పలాస

పార్టీలో శ్రమించి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందనిటిడిపి పలాస నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి అన్నారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం శ్రీకాకుళం పార్లమెంటరీ స్థాయి, టిడిపి సంస్థాగత పదవులకు ఎన్నికైన ఉపాధ్యక్షులు గాలి కృష్ణారావు, స్పోక్స్ పర్సన్ హేమబాబు చౌదరి, ఆర్గనైజేషన్ సెక్రెటరీ పాండురంగరావు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పి.విఠల్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.